క్లుప్తంగా

ముంగరకు అభినందనలు



జెడ్పీ చైర్‌పర్సన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర వడ్డీ కార్పొరేషన్ చైర్మన్

ఏలూరు(మెట్రో): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వడ్డీ కార్పొరేషన్ చైర్మన్‌గా నూతనంగ ఎన్నికైన ముంగర సంజీవ్ కుమార్ ఆదివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్‌ను జెడ్పీ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దంపతులు ముంగర సంజీవ్ కుమార్‌ని దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

విద్యార్థినికి ఆర్థిక సహాయం



విద్యార్థినికి నగదు అందజేస్తున్న ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు తమ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఓ విద్యార్థినికి ఆర్థిక సహాయం చేశారు. స్థానిక సెయింట్ థెరిస్సా కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న టి.జ్యోతి అనే విద్యార్థినికి విద్యావసరాల నిమిత్తం ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం స్థానిక కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు నగదును అందించారు.

చెరుకు తోట దగ్ధం



దగ్ధమైన చెరుకు తోట

కొయ్యలగూడెం: చొప్పరామన్నగూడెంలో ఆదివారం సాయంత్రం చెరుకు తోట దగ్ధమైంది. గవరవరం గ్రామానికి చెందిన కౌలు రైతు చుక్కల అన్నవరానికి రెండు ఎకరాలలోని చెరకు తోటకు తీవ్ర నష్టం వాటిల్లింది. తుపాను నేపథ్యంలో గాలులు వీయడం వల్ల చెరుకు తోట మీదుగా వెళ్లిన 11 కేవీ విద్యుత్ వైర్లు ఒకదానికొకటి తగలడంతో ప్రమాదం సంభవించిందని రైతు అన్నవరం పేర్కొన్నాడు. జంగారెడ్డిగూడెం నుంచి అగ్నిమాపక వాహనంతో ఫైర్ ఆఫీసర్ జి.అబ్రహం వచ్చి దగ్ధం అవుతున్న చెరకుతోటలోని మంటలను అదుపులోకి తెచ్చారు. రైతుకు సుమారు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని అగ్నిమాపక అధికారి అబ్రహం పేర్కొన్నారు.

పిల్లల పండుగ వచ్చేసింది..

- 16, 17 తేదీల్లో నగరంలో 4వ బాలోత్సవం
- దాదాపు 40 అంశాల్లో బాలలకు పోటీలు
- రికార్డు స్థాయిలో వెయ్యి మంది బాలలతో పాటకు ఏర్పాటు
- బాలల వికాసం కోసం పెద్దల యజ్ఞం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగైపోయిన నేపథ్యంలో రేపటి తరాన్ని ఆరోగ్యకరంగా సమాజానికి అందించాలనే ఆలోచన కరువైపోయింది. యాంత్రిక జీవనంలో ప్రతి ఒక్కరూ సంపాదన దృక్కోణంలో ఆలోచించడంతో పిల్లల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. విద్యా వ్యవస్థ సైతం కేవలం మార్కులు, ఉద్యోగాల బాటలో నడుస్తుండడంతో భావిభారత పౌరుల ఆలోచనలను సన్మార్గంలో నడిపే వ్యవస్థ కావాల్సిన అవసరం ఏర్పడింది. దీనిపై నగరంలోని కొంతమంది మేధావులు, దాతలు ఒక సదాశయంతో హేలాపురి బాలోత్సవం పేరిట పిల్లల సంబరాలు నిర్వహించడానికి పూనుకున్నారు. అది కూడా ఏదో పేరుకు చేస్తున్నాం అన్నట్టుగా కాకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలు ఆశించి చేస్తుండడం విశేషంగా చెప్పుకోవాల్సిందే.

సృజనాత్మక శక్తి, ప్రతిభలను వెలుగులోకి తీసుకువచ్చే విధంగా..

పిల్లల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మక శక్తిని, వారిలోని ప్రతిభను వెలికి తీయడానికి వారిలో ఉన్న అభిరుచిని ప్రోత్సహించడానికి ఈ బాలోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. మారిన సామాజిక పరిస్థితులు, అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో పిల్లలు గడప దాటి బయటకు వచ్చే పరిస్థితి నేటి సమాజంలో అరుదుగా చూస్తున్నాం. ఏ సినిమాలకో, లేదా రెస్టారెంట్లలో భోజనాలకో తప్పించి తల్లిదండ్రులు తమ పిల్లలను బయటకు వదలడం అరుదుగా కనిపిస్తోంది. పాఠశాలల్లో ఉదయం 8 గంటలకు మొదలు పెట్టిన చదువు ఇంటికి వచ్చి రాత్రి 9 గంటల వరకూ కొనసాగుతుండడంతో బాలల్లో ప్రాపంచిక జ్ఞానం లోపిస్తోంది. వీటన్నింటినీ అధిగమించడానికి ఉన్న ఏకైక మార్గమే వారి దృష్టిని ఇతర అంశాలపై కూడా కేంద్రీకరింపచేయడం.



వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు (ఫైల్)



పోటీల్లో భాగంగా విద్యార్థుల విన్యాసాలు (ఫైల్)



సాంస్కృతిక పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు (ఫైల్)

ఈ నెల 16, 17 తేదీల్లో పిల్లల సంబరాలు

హేలాపురి బాలోత్సవం 4వ ఏడాదికి గాను ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహించడానికి బాలోత్సవ కమిటీ ఏర్పాటు చేస్తోంది. 2019వ సంవత్సరం నుంచి ఇప్పటి వరకూ మూడుసార్లు బాలోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులు ఈ ఏడాది మరింత పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఏలూరు నగరంతో పాటు ఏలూరు మండలం, పెదపాడు, పెదవేగి, దెందులూరు, భీమడోలు, ముసునూరు మండలాల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకూ చదువుతున్న పిల్లలకు వారి ప్రతిభను పదిమందిలో ప్రదర్శించడానికి ఈ వేదికను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. దాదాపు 500 పాఠశాలల నుంచి 10 వేల మంది విద్యార్థులను ఈ పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఇప్పటికే యా పాఠశాలల యాజమాన్యాలకు పోటీల వివరాలు తెలిపి విద్యార్థులను పాల్గొనేలా చేయాలని కోరారు.

రికార్డు స్థాయిలో వెయ్యి మంది బాలలతో పాట..

ఈ ఏడాది నిర్వహిస్తున్న ఉత్సవాలకు మరో ప్రత్యేకత కల్పించాలనే ఉద్దేశ్యంతో నిర్వాహకులు సుమారు వెయ్యి మంది బాలలతో రికార్డు స్థాయిలో పాట పాడించడానికి ఏర్పాటు చేశారు. చదువు గొప్పతనాన్ని, అవసరాన్ని వివరించేలా «చదవాలిరా ఎన్ని ఆటంకాలొచ్చినా» అనే గీతాన్ని పాడించాలన్నదే నిర్వాహకుల లక్ష్యం. కాగా ఇంతమంది పాడుతున్న పాటను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు చేయించడానికి కూడా చర్యలు చేపట్టారు.

దాదాపు 40 అంశాల్లో పోటీలు

పిల్లల్లో ఒకొక్కరికీ ఒకొక్క అభిరుచి ఉంటుంది. ఒకొక్క అంశంపై ఆసక్తి ఉంటుంది. కొందరు క్రీడల్లో ప్రతిభ కలిగి ఉంటారు. మరికొందరు సాహిత్యంవైపు అడుగులు వేస్తుంటారు. మరికొందరు చిత్రలేఖనంలో సృజనాత్మక శక్తిని జోడిస్తుంటారు. ఎవరికి ఏ రంగంపై ఆసక్తి ఉన్నా అందరికీ అవకాశం కల్పించాలనే లక్ష్యంతో దాదాపు 40 అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. సైన్స్ ప్రయోగాలు, అభ్యుదయ పాటలు, విచిత్ర వేషధారణ, శాస్త్రీయ నృత్యం, ఏకపాత్రాభినయం, లఘునాటికలు, వాద్య సంగీతం, గాత్ర సంగీతం, శాస్త్రీయ, జానపద సంగీతాలు కథలు చెప్పడం, కథలు రాయడం, మ్యాజిక్, మట్టితో బొమ్మలు తయారు చేయడం ఇలా ఎన్నో అంశాల్లో పోటీలు ఉండబోతున్నాయి. అదికూడా ఎల్‌కేజీ, యూకేజీ, 1వ తరగతి వారికి ఒక విభాగం, 2,3,4 తరగతులకు ఒక విభాగం, ఆ పై తరగతులకు ఒక విభాగంగా పోటీలు నిర్వహిస్తున్నారు.

పిల్లల కోసం పెద్దలు చేపట్టిన మహాయజ్ఞం

పిల్లలను సమాజానికి ఉపయోగపడే భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడానికి పెద్దలు చేస్తున్న ఒక మహాయజ్ఞంగా ఈ బాలోత్సవాన్ని అభివర్ణించవచ్చు. పిల్లల్లోని మూఢనమ్మకాలను పారదోలడానికి, నిర్లక్ష్య ధోరణిని విడనాడడానికి, సేవాగుణం అలవరచడానికి, శారీరక సామర్థ్యాలు పెంచడానికి, కుటుంబ బంధాలు బలపరచడానికి, స్నేహం విలువను తెలియచేయడానికి ఇలా అనేక ప్రయోజనాలు ఆశించి చేస్తున్న ఈ యజ్ఞం మరింత కాలం కొనసాగాలనే పట్టుదలతో నిర్వాహకులు ఈ వేదికను ఎంతోమంది సహాయ సహకారాలతో నిర్మిస్తున్నారు.

పోటీలకు 10 వేదికలు సిద్ధం



దాదాపు 10 వేల మంది పిల్లలను ఆయా అంశాల్లో ప్రోత్సహించడానికి ఈ బాలోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాం. ఈ పోటీల్లో భాగంగా సాంస్కృతిక అంశాలకు గాను నగరంలోని సురేష్ చంద్ర బహుగుణ పాఠశాలలో 10 వేదికలను సిద్ధం చేశాం. అలాగే అకడమిక్ పోటీలకు గాను ఇదే పాఠశాలలో 15 తరగతి గదులను అందుబాటులోకి తీసుకువచ్చాం. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు పిల్లలతో పాటు తల్లిదండ్రులకు తీపిజ్ఞాపకాలు మిగుల్చుతాయనడంలో సందేహం లేదు. – ఆలపాటి నాగేశ్వరరావు, హేలాపురి బాలోత్సవం అధ్యక్షుడు

8వ తేదీ వరకు గడువు..



పోటీల్లో పాల్గొనే వారు తమ ఎంట్రీలు పంపడానికి ఈ నెల 8వ తేదీ వరకూ గడువు ఉంది. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్ వచ్చే ఏర్పాటు చేశాం. ప్రతి రోజూ 5 వేల మందికి తగ్గకుండా భోజనం, అల్పాహారం, పానీయాలు అందుబాటులో ఉంచుతున్నాం. ఈపోటీల్లో వివిధ రంగాల ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖలు అధికారులు భాగస్వాములుగా ఉన్నారు. ఈ పోటీలకు విద్యార్థులను తీసుకువచ్చే ఉపాధ్యాయులకు కూడా ప్రోత్సాహంగా ప్రశంసాపత్రాలు అందచేస్తున్నాం. – గుడిపాటి నరసింహరావు, నిర్వాహక కార్యదర్శి

జిల్లాలో విస్తృతంగా పోలీసుల తనిఖీలు

ఏలూరు (టూటౌన్): రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు, గంజాయి, మద్యం, సారా వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల తీవ్రత, ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ముఖ్య కూడళ్లు, ప్రార్థనాలయాలు, మసీదులు ఆలయాల వద్ద బందోబస్తు నిర్వహించారు.

యువతిని పరామర్శించిన ఎస్పీ

ఏలూరు (టూటౌన్): వేలేరుపాడుకు చెందిన కాలిన గాయాలతో ఉన్న ఓ యువతని ఆదివారం మెరుగైన వైద్యం నిమిత్తం ఆమె కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతున్న యువతిని జిల్లా ఎస్పీ మేరి ప్రశాంతి ఆదివారం పరామర్శించారు. ఘటనకు సంబంధించి బాధితురాలి వద్ద వివరాలు తెలుసుకునేందుకు ఎస్పీ ప్రయత్నించగా ఆమె మాట్లాడలేని పరిస్థితుల్లో ఉంది. దీంతో ఆమె కుటుంబ సభ్యులతో ఎస్పీ మాట్లాడి వివరాలు తీసుకున్నారు. దీనిపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్పీ తెలిపారు.

మోసపోయిన బాధితులకు న్యాయం చేయాలి

ఏలూరు (టూటౌన్): నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తానని కోట్లు వసూలు చేసి ఉడాయించిన ఆదిత్య మ్యాన్ పవర్ కన్సల్టెన్సీ యజమాని తలశిల నరసింహంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య ఒక ప్రకటనలో కోరారు. స్థానిక నరసింహారావుపేటలో ఆదిత్య మ్యాన్ పవర్ కన్సల్టెన్సీ అనే బోగస్ సంస్థ ఆఫీసు ఏర్పాటు చేసి వివిధ ప్రభుత్వ శాఖలలో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి దాదాపు 200 మంది నుంచి ఒక్కో పోస్టుకి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల చొప్పున వసూలు చేసి ఉడాయించారని ఆరోపించారు. దీనిపై బాధితులు స్థానిక త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని, ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

హిందువులంతా ఐక్యం కావాలి



హిందూ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న అనగానంద స్వామీజీ

కుక్కునూరు: హిందువులంతా ఐక్యం కావాల్సిన అవసరం ఉందని దత్తపీఠం గురూజీ అనగానంద స్వామీజీ పేర్కొన్నారు. ఆదివారం కుక్కునూరు రామసింగారం ప్రాథమిక పాఠశాలలో సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అనగానంద స్వామీజీ మాట్లాడుతూ, హిందుత్వం అంటే జీవన విధానమన్నారు. హిందువులు ఆచరించే ప్రతి పనికి సైంటిఫిక్‌గా వివరణలున్నాయన్నారు. ప్రస్తుత కాలంలో హిందుత్వంపై దాడి ఎక్కువైందన్నారు. ఇటువంటి తరుణంలో హిందువులందరూ ఐక్యమై హిందుత్వాన్ని నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు. సమరసతా సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ ముప్పాళ్ల సాంబశివరావు మాట్లాతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలో ఐదు దేవాలయాలు నిర్మించినట్టు చెప్పారు. అంతేకాక దివ్య దర్శనం పేరుతో ఎస్సీ, ఎస్టీలను ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శింపచేసినట్టు చెప్పారు. ఇక ముందు కూడా మరిన్ని ధార్మిక కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ భూపతి, గురుస్వాములు బట్టు వీరబాబు, ముప్పాళ్ల సత్యనారాయణ, మల్లయ్య, బొక్కా వెంకట్రావు, ధార్మిక సంస్థ సభ్యులు బొల్లు ప్రసాద్, మణికంఠ, నరసయ్య, ముక్తేశ్వరావు, తిరుపతమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు, వైస్ ఎంపీపీ గాడిద రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'రాగాలా – సరాగాలా'

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 101 జయంతిని పురస్కరించుకుని ఆదివారం రాత్రి స్థానిక వైఎంహెచ్ఏ హాలులో నిర్వహించిన రాగాలా – సరాగాలా కార్యక్రమం ఘంటసాల అభిమానులను, సంగీత ప్రియులను విశేషంగా అలరించింది. నగరానికి చెందిన ఘంటసాల సంగీత కళాశాల, తెలుగు రచయితల సంఘం, ఘంటసాల స్వరపీఠం సంయుక్త ఆధ్వర్యంలో «శతాబ్ది గాయకుణ్ణి స్మరించుకుందాం» పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు గాయకులు ఘంటసాల వివిధ చలనచిత్రాల్లో పాడిన విజయవంతమైన గీతాలను ఆలపించి వీనుల విందు చేశారు. ఈ సందర్భంగా గాయకులకు కీబోర్డుతో రవి, తబలాతో కళ్యాణ్, ప్యాడ్స్‌తో చిన్న వాద్య సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల సంగీత కళాశాల వ్యవస్థాపకులు టి.శరత్ చంద్ర, రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు, ఘంటసాల సంగీత కళాశాల ఏలూరు అధ్యక్షురాలు వీ.రేవతి రామ్‌కుమార్, ఎస్ఎం.సుభాని, వై.అర్జునరావు, ఎండీ ఖాజావలి, ఆలపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఘంటసాల పాటలు పాడుతున్న గాయకులు

పేదల సంక్షేమానికి బహుజన సేన కృషి

ఏలూరు (టూటౌన్): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, పేదల హక్కుల కోసం రాజకీయాలకు అతీతంగా బహుజన సేన పనిచేస్తుందని సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మత్తే బాబి అన్నారు. స్థానిక ఇండోర్ స్టేడియం ఎదురుగా గల లేడీస్ క్లబ్ నందు బహుజన సేన కమిటీ సమావేశం ఆదివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా మత్తే బాబీ మాట్లాడుతూ బహుజన సేన కులమతాలకు అతీతంగా పనిచేస్తుందని, సమాజంలో ఎవరికైనా అన్యాయం జరిగితే వారికి అండగా నిలుస్తుందన్నారు. పేదల ఆర్థికాభివృద్ధితో పాటు వారి సంక్షేమానికి తన వంతు పోరాటాన్ని బహుజన సేన చేస్తుందన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఫాదర్ పి.బాల, ఆలిండియా దళిత రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రేవులగడ్డ మణి సుందర్ సింగ్, ఏపీ హైకోర్టు న్యాయవాదులు గంటా రాజశేఖర్, దొడ్డిగర్ల సుమలత మాట్లాడుతూ నిరంతరం అంబేడ్కర్ ఆశయ సాధనకై తనవంతు కృషి చేస్తున్న మత్తే బాబీ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం బహుజన సేనను ఏర్పాటు చేయడం హర్షనీయం అన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను వారు అభినందించారు. కమిటీకి తమ వంతు సహకారం అందజేస్తామని తెలియజేశారు. సమావేశంలో దేవరకొండ వెంకటేశ్వర్లు, కందుల రమేష్, హాజీ ఆరిఫ్, బహుజన సేన నాయకులు పాల్గొన్నారు.



బహుజన సేన లోగోను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	34
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	28
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	34
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	04

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	21
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	15
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	15
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	32
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	15
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	21
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –తిరుపతి	16.00	4830	21

అగ్నిప్రమాదంలో రూ.2.50 లక్షల ఆస్తి నష్టం

జంగారెడ్డిగూడెం: స్థానిక సాలిపేటలోని నౌడువారి వీధిలో ఆదివారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో రూ.2.50 లక్షల ఆస్తినష్టం సంభవించింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి కొల్లి సూర్యారావు ఇంట్లో వంటగదిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో వంట గదిలోని ఫ్రిజ్, వాషింగ్ మెషీన్, టేబుళ్లు, గ్రైండర్, వంట సామాగ్రి, కప్‌బోర్డులు, ఏసీ, ఇంటి తలుపులు, విద్యుత్ వైర్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూట్ అవుతున్న శబ్దానికి భయపడి కొల్లి సూర్యారావు దంపతులు బయటకు వచ్చేశారు. చుట్టుపక్కల వారు వచ్చి అగ్నిమాపక శాఖ కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక అధికారి బి.అబ్రహ్మం, లీడింగ్ ఫైర్‌మన్ వెంకటరమణ సిబ్బందితో వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో రూ.2.50 లక్షలు ఆస్తి నష్టం ఉంటుందని అగ్నిమాపకశాఖ అధికారులు తెలిపారు.

ధరల అదుపులో బీజేపీ ప్రభుత్వం విఫలం

ఏలూరు (టూటౌన్): నిత్యావసర సరుకుల ధరలను అదుపు చేయడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా నాయకులు బి.సోమయ్య అన్నారు. స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయం నందు నగర కార్యకర్తల సమావేశం ఆదివారం సాయంత్రం వి.సాయిబాబు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సోమయ్య మాట్లాడుతూ కేంద్రం పెట్రోల్, డీజిల్, గ్యాస్ చార్జీలు ఇష్టానుసారంగా పెంపుదల చేసిందని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రశ్నిస్తున్న వారిపై దేశద్రోహం కేసులు పెడుతుందని ఆరోపించారు. ప్రజాస్వామ్య హక్కులు, రక్షణకు, నిత్యావసర సరుకుల ధరల అదుపు కోసం ప్రజలంతా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సీపీఎం నగర కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడుతూ నిర్మాణం పూర్తి చేసుకున్న టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని, జగనన్న కాలనీల్లో సౌకర్యాలు కల్పించాలని కోరారు. పవరుపేటలో బ్రిడ్జి« శనివారపుపేట కాజ్‌వేపై వంతెన నిర్మాణం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీపీఎం నగర నాయకులు బి.జగన్నాధరావు, కె.రామాంజనేయులు, వీవీవీఎస్ ప్రసాద్, జె.గోపి, ఎం.ఇస్సాక్, కోటేశ్వరరావు, ఏసుబాబు పాల్గొన్నారు.



సీపీఎం నగర కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బి.సోమయ్య

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	32	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	44	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	48	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	07–10
బెండకాయలు	40	కంద	60
పచ్చిమిర్చి	30	బీట్‌రూట్	40
కాకర కాయలు	30–34	కీరా దోస	40
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	44	అల్లం	120
క్యాబేజీ	20	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	40–54	పాలకూర	10
దొండకాయలు	26	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	45–50	గోంగూర	06
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	20	బఠాణి	--
ఆనపకాయ (1)	20–25	క్యాప్సికమ్	64
పొట్లకాయ(1)	15–20	చిలకడదుంప	30

తెలుగు మహాసభలకు తరలిరండి

ద్వారకాతిరుమల: తెలుగు మహాసభలకు తరలిరావాలని ఆంధ్ర సారస్వత్ పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ట్రస్ట్ చైర్మన్ బొండాడ రాంపండును ఆదివారం గజల్ మర్యాద పూర్వకంగా కలిసి, తెలుగు మహాసభల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా గజల్ మాట్లాడుతూ పట్టు కోల్పోతున్న తెలుగు భాషను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అందులో భాగంగా రాజమహేంద్రవరంలో జనవరి 4, 5, 6 తేదీల్లో నిర్వహించనున్న రెండవ అంతర్జాతీయ తెలుగు మహాసభలకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చేలా చూడాలని రాంపండును కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ఇన్‌చార్జి నల్లమెల్లి జగన్నాధరావు, రిటైర్డ్ తెలుగు లెక్చరర్ తడికమళ్ళ జగన్మోహిని, తెలుగు మహాసభల ఏలూరు జిల్లా ప్రతినిధులు వీరమల్ల మధు, పోరంకి నాగరాజు తదితరులున్నారు.



ద్వారకాతిరుమల ఆర్యవైశ్య కల్యాణ మండప ట్రస్ట్ చైర్మన్ రాంపండుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న గజల్ శ్రీనివాస్

అధికారులపై అలిగి..!

శ్రీవారి దర్శనార్థం ఆదివారం ఆలయానికి విచ్చేసిన ఆంధ్ర సారస్వత్ పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ అక్కడున్న దేవస్థానం అధికారులపై అలిగారు. వివరాల్లోకి వెళితే. స్వామివారి దర్శనార్థం గజల్ శ్రీనివాస్ మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఆలయానికి విచ్చేశారు. ఆయనను ప్రొటోకాల్ ఏఈఓ పి.నటరాజారావు ఆలయ కార్యాలయం వద్దకు తీసుకెళ్లారు. అయితే అప్పటికే సాధారణ భక్తులతో పాటు, నిత్యార్జిత కల్యాణంలో పాల్గొన్న భక్తులతో ఆలయం రద్దీగా ఉంది. దాంతో స్వామివారి అంతరాలయ దర్శనానికి వెళ్లాలంటే కొద్ది సేపు వేచి ఉండాలని ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు గజల్‌కు సూచించారు. దీంతో అధికారులపై అలిగిన గజల్ రూ.200 ల క్యూలైన్ గుండా ఆలయంలోకి వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించారు. ఆ తరువాత అక్కడి నుంచి వెళ్లిపోయారు.